ప్రజాశక్తి

మంగళవారం 2 జులై 2024 5

శ్రీ సత్యసాయి



బీసీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ

అనంతపురం : డీఎస్సీ ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ పరీక్షలకు చదువుకునే విద్యార్థులకు అనంతపురం బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అనంతపురం బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఖుష్బు కొఠారి సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. టెట్ పరీక్షలో అర్హత సాధించిన వారికి ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఉమ్మడి జిల్లా పరిధిలో 200 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. టెట్ మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. జూలై 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జూలై 11వ తేదీ నుండి 60 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కాలంలో 75శాతం హాజరు ఉన్న వారికి స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తారు. అభ్యర్థులు వారి బయోడేటాతో పాటు టెట్ మార్కుల జాబితా, టిసి, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ, రూ.1లక్షలోపు ఆదాయ పత్రాలు, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలను జతపరచి అనంతపురం కలెక్టరేట్ పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందజేయాలి. మరిన్ని వివరాలకు నేరుగా కార్యాలయంలో గానీ, ఫోన్ నెంబరు 08554-275575 గానీ సంప్రదించవచ్చు.



పాత విధానమే..!

ప్రభుత్వం మారినా ఇసుక దోపిడీలో మార్పు కనిపించడం లేదు. పాత విధానం కాకుండా కొత్త విధానాన్ని తీసుకొస్తామని అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించింది. గతంలో లాగా ప్రభుత్వం అమ్మే పద్ధతి కాకుండా ఉచితంగానే అందిస్తామని కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన అక్రమాలపైనా నివేదికలివ్వాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ఈ పరిస్థితుల్లో పాత అక్రమాలు, పద్ధతులకు చెల్లుచీటి అని అందరూ భావించారు. కాని కొత్త ప్రభుత్వంలోనూ పాత పద్ధతులే కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- ◆ ఇసుక తరలింపునకు రాని కొత్త విధానం
- ◆ పాలకులు మారినా మారని తీరు
- ◆ యథేచ్ఛగా కొనసాగుతున్న తవ్వకాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇసుక తరలింపునకు సంబంధించి కొత్త ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం ఇంకా వెలువరించలేదు. అప్పుడే కొంత మంది ప్రజాప్రతినిధుల అనుయాయులు కొత్త యంత్రాలు, టిప్పర్లను దింపేశారు. నదుల్లోని ఇసుకను తోడటం మొదలు పెట్టారు. అనంతపురం జిల్లాలో కొన్ని చోట్ల తవ్వకాలు మొదలయ్యాయి. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న ఒక నియోజకవర్గంలో రెండు యంత్రాలతో నిరంతరాయంగా తవ్వకాలు చేస్తున్నారు. కొన్ని వాహనాలను పోలీసులు పట్టుకుని స్టేషన్లకు సైతం తరలించారు. పక్క జిల్లా సరిహద్దునున్న మరో నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. ఇది చూసి అధికారులే నివ్వెరపోతున్నారు. ఇంకా పట్టుమని 15 రోజులు కూడా అధికారంలోకి రాకముందే ఈ రకంగా మొదలుపెడితే ఎలాగంటున్నారు.

కొత్త విధానం వచ్చేలోపు తోడేసేందుకు సిద్ధం..

ప్రభుత్వం ఇసుకపై కొత్త విధానాన్ని తీసుకొచ్చేలోపు అనుమతులున్నా.. లేకున్నా తమ పని తాము కానిచ్చేందుకు కొంత మంది నేతలు సిద్ధమయ్యారన్న ఆరోపణలున్నాయి. ఆ తరువాత పరిస్థితి ఏరకంగా ఉంటుందో అంతలోపే కావాల్సినంత తోడేసి సొమ్ము చేసుకుంటే సరిపోతుందన్న ఉద్దేశంతో పని మొదలు పెట్టారు. దీన్ని నిలువరించాల్సిన అధికార యంత్రాంగం ఏమి చేయాలో పాలుపోని పరిస్థితుల్లో ఉంది. ఎన్నికల సమయంలో నియమితులైన రెవెన్యూ, పోలీసు అధికారులు దీని పట్ల గట్టిగా వ్యవహరిస్తే ఎటువంటి పరిణామాలు ఎదురు చూడాల్సి వస్తుందోనని భయపడిపోతున్నారు. జిల్లాలో ప్రధానంగా పెన్నా నది పరివాహక ప్రాంతమే ఎక్కువగా ఉంది. ఈ నదిలోనే అనేక చోట్ల యంత్రాలను ఏర్పాటు చేసుకుని టిప్పర్లు, లారీల్లో రోజుకు పదుల సంఖ్యలో వాహనాలు తరలిపోతున్నాయన్న ఆరోపణలున్నాయి. జిల్లాలోని ప్రధాన పట్టణాలతోపాటు పక్క రాష్ట్రానికి తరలిపోతోంది. కొన్ని చోట్ల మాత్రం పట్టుబడి సమస్య లేకుండా ఉండేందుకు ముందుగానే ప్రభుత్వ పనుల నిమిత్తం అనుమతులు తీసుకున్నట్టుగా అధికారులతో ఉత్తరాలు తీసుకుని మరీ తరలిస్తుండటం గమనార్హం. ఈ రకంగా చాలా చోట్ల యథేచ్ఛగా ఈ వ్యవహారం నడుస్తున్నా అధికార యంత్రాంగం మిన్నకుండిపోతోంది. ఈ రకంగా సహజ వనరుల దోపిడీ పాలకులు మారినా తీరు మారలేదంటూ సామాన్యులు వాపోతున్నారు.

మాటల ప్రభుత్వం కాదు

మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణం పాతపేటలో లబ్ధిదారురాలికి పింఛను అందిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్ కలెక్టర్ వినోద్‌కుమార్

టిడిపి మాటల ప్రభుత్వం కాదు... చేతల ప్రభుత్వం. పండగలాంటి వాతావరణంలో ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం. వాడవాడలా సమాజ హితం కోరే నాయకులు, అధికార యంత్రాంగం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయినప్పుడు జరిగిన నష్టం కన్నా గత ఐదేళ్లలో జరిగిన నష్టం చాలా ఎక్కువ. క్లిష్ట పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన నారా చంద్రబాబునాయుడు ఆర్థిక రంగం ఏ పరిస్థితుల్లో ఉందేనే అంచనా వేసే ప్రయత్నం చేస్తున్నారు. అన్నింటినీ చక్కదిద్ది రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లి, ప్రజల మనసుల్లో చిరకాలం నిలిచేలా తమ ప్రభుత్వం పని చేస్తుంది.

రాష్ట్రంలో సంక్షేమ పండుగ

మంత్రి సవితమ్మ



శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్లలో పింఛన్ అందించి లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి సవితమ్మ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సంక్షేమ పండుగ ప్రారంభం అయ్యింది. అందులో భాగంగానే రూ.3వేల పింఛన్‌ను రూ.4వేలకు పెంచి 1వ తేదీ ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్ల వద్దకెళ్లి పంపిణీ చేస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధి ,సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని సామాజిక భద్రతపై మూడవ సంతకం చేశారు. ఈ సంతకంతో ప్రతి నిరుపేద ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా గత ప్రభుత్వం కంటే మెరుగుగా పెన్షన్లను పెంచి పేదలకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

మాట నిలుపుకున్నాం...

మంత్రి సత్యకుమార్ యాదవ్



శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం వేల్పుమడుగు గ్రామంలో పింఛన్లు అందిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.4వేలకు పెంచి మాట నిలుపుకున్నాం. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన అదనపు రూ.3వేలను కూడా లబ్ధిదారులకు అందించాం. గత ప్రభుత్వం పింఛన్‌ను రూ.2 వేల నుంచి రూ.3 వేలు చేసేందుకు 5 సంవత్సరాల సమయం తీసుకుంది. తమ ప్రభుత్వం 3 వేల రూపాయల పెన్షన్‌ను 15 రోజుల వ్యవధిలోనే రూ.4 వేలకు పెంచి లబ్ధిదారులకు అందజేశాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇకపై ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ లబ్ధిదారులకు వారి ఇంటివద్దే పింఛన్ మొత్తాన్ని అందిస్తాం. పింఛన్ పెంపుతో పేదలందరి కళ్లల్లో ఆనందం కన్పిస్తోంది.

పింఛన్..!

- ◆ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ
- ◆ పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు
- ◆ సర్వర్ సమస్యతో కాస్త ఇబ్బందులు



పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి సవితమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ఉదయం ప్రారంభం అయ్యింది. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు రూ.3వేల పింఛన్‌ను రూ.4వేలకు పెంచారు. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈకార్యక్రమాన్ని ఉదయం 6 గంటల నుంచే ప్రారంభించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, టిడిపి శ్రేణులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం కొంత సేపు సర్వర్ సమస్య రావడంతో పింఛన్ల పంపిణీకి ఆటంకం ఏర్పడింది. ఆ తర్వాత యథావిధిగా పింఛన్ల పంపిణీ కొనసాగింది. మొదటి రోజు 90 శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేసినట్లు అధికారులు ప్రకటించారు.

అనంత జిల్లాలో 2,89,508 మంది లబ్ధిదారులకు...

అనంతపురం జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభం అయ్యింది. మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు అందరూ ఈకార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు అందించారు. ఉరవకొండ పట్టణంలోని పాతపేట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్‌లు స్వయంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఏప్రిల్, మే, జూన్ అరియర్స్ రూ.3,000, జులై నెల పింఛన్ రూ.4000 కలిపి మొత్తం రూ.7,000ను లబ్ధిదారులకు అందజేశారు. జిల్లాలో వివిధ విభాగాల పరిధిలో 2,89,508 మంది లబ్ధిదారులకు రూ.197.44 కోట్లను పింఛన్ల రూపంలో అందించినట్లు కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు.

శ్రీసత్యసాయి జిల్లాలో 2,70,966మందికి..

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలోని గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం కొనసాగింది. ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకెళ్లి పింఛన్లను అందించారు. జిల్లాలోని అందరూ ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రులు స్వయంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెనుకొండ నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ, ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండల పరిధిలోని వేల్పుమడుగు గ్రామంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, మడకశిర నియోజకవర్గం రొళ్ల మండల పరిధిలోని కరిదసానపల్లి, ఎం.రాయపురం, గుణేమొరుబాగల్, మొరుబాగులు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో హిందూపురం పార్లమెంటు సభ్యులు బికె.పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమాల తిప్పేస్వామి, కలెక్టర్ అరుణ్‌బాబు, సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ పాల్గొన్నారు. ఏప్రిల్, మే, జూన్ అరియర్స్ రూ.3,000, జులై నెల పింఛన్ రూ.4000 కలిపి మొత్తం రూ.7,000ను లబ్ధిదారులకు అందజేశారు. జిల్లాలో వివిధ విభాగాల పరిధిలో 2,70,966మందికి రూ.184.70 కోట్లను లబ్ధిదారులకు పింఛన్ల రూపంలో అందించినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలియజేశారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం

వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి

ప్రజాశక్తి - కదిరి టౌన్



బంగారు కృష్ణమూర్తిని సన్మానిస్తున్న నాయకులు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామనివాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బంగారు కృష్ణమూర్తి స్వగృహంలో రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు . ఈ కార్యవర్గ సమావేశంలో మొదట రాష్ట్ర అధ్యక్షులుగా బంగారు కృష్ణమూర్తిని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొర్లపల్లి మోహన ,రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా ఆనంద్ , ట్రెజరీగా శ్రావణమూర్తి, రాష్ట్ర అధికార ప్రతినిధిగా మేకల శివప్రసాద్ ని ఎన్నుకున్నారు. అదే విధంగా సత్యసాయి జిల్లా అధ్యక్షునిగా మల్లెం అశోక్, ఉపాధ్యక్షులుగా ముద్దల చిన్న నరసింహులు , ముదిగుబ్బ మండల అధ్యక్షునిగా వీరనారప్పను ఎన్నుకొన్నారు. బంగారు కృష్ణమూర్తి నూతనంగా ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. బంగారు కృష్ణమూర్తి పుట్టినరోజు పురస్కరించుకొని పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను ఈసందర్భంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - సోమందేపల్లి




మంత్రికి వినతిని అందజేస్తున్న నాయకులు, కార్మికులు

పరిగి గ్రామపంచాయతీ కార్మికులకు 10నెలలు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం పెనుకొండ పట్టణంలోని మంత్రి సవితమ్మ స్వగృహం వద్ద పరిగి పంచాయతీ కార్మికులతో కలసి కార్మికుల సమస్యలపై మంత్రికి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కార్మికులకు గత 11 నెలలు అరియర్స్ ఇవ్వలేదన్నారు. నూనె ,సబ్బులు , చెప్పులు, చెప్పులు, ఇవ్వాలని కోరారు. రెండు నెలల నుండి కార్మికుల సమస్యలను సర్పంచి, గ్రామ పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. మంత్రి స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి మీకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు మూర్తి, రామాంజి, కార్మికులు పాల్గొన్నారు.

లోచర్ల పెద్దారెడ్డి సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్



లోచర్ల పెద్దారెడ్డి స్థూపం వద్ద ఎమ్మెల్యే, మాజీ మంత్రి, తదితరులు

పేద ప్రజల అభ్యున్నతి కోసం పెద్దారెడ్డి చేసిన సేవలు మరువలేనివని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి శ్రీ సత్యసాయి స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో కామ్రేడ్ పెద్దారెడ్డి ఎనిమిదవ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హాజరయ్యారు. లోచర్ల పెద్దారెడ్డి కుమారుడు లోచర్ల విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ కామ్రేడ్ పెద్దారెడ్డి పేదలకు చేసిన సేవలు ఎనలేనివనికొనియాడారు. ప్రజల కోసం ఆయన జీవితం అంకితం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి టిడిపి నాయకులు, కామ్రేడ్ పెద్దారెడ్డి అభిమానులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-హిందూపురం


హిందూపురం పురపాలక సంఘంలో పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని ఇందిర పార్కు నుంచి రైల్వే రోడ్డు మీదుగా మున్సిపల్ కార్యాలయం వదరకు ర్యాలీ నిర్వహించి, కమిషనర్ చాంబర్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఈఎస్ వెంకటేష్, మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి జగదీష్ మాట్లాడుతు పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని 4 సంవత్సరాలుగా కోరుతున్నప్పటికి సమస్యలను పరిష్కరించ కుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆందోళనలు తీవ్రతరం చేస్తే ఆ సమయంలో మాత్రం పరిష్కరిస్తామని హామీ ఇచ్చి తిరిగి పట్టించుకోరని అన్నారు. పురపాలక సంఘంలో 25 మంది పారిశుధ్య కార్మికులను డ్రైవర్లుగా గుర్తించి ఇందులో 13 మందిని నియమించి, మిగిలిన వారిని డ్రైవర్లుగా నియమించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సమస్యలను పరిష్కరించక పోతే నిరవధిక సమ్మెకు వెళుతామన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి వినతిని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాము, కార్మిక సంఘం నాయకులు మల్లికార్జున, ఆనంద్, రామచంద్ర, గురునాథ్, మూర్తి, నరసింహా మూర్తి, శంకర, బాలాజీ, నారాయణ, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిని ఇస్తున్న సిఐటియు నాయకులు

'రాజధాని కోసం నెల పింఛన్'

అమరావతి అభివృద్ధికి అందజేసిన వృద్ధురాలు



పింఛను మొత్తాన్ని మంత్రికి అందజేస్తున్న వృద్ధురాలు నారాయణమ్మ

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

నాకు చదువు సంధ్యలు లేవు. మా ఇంటిలో పిల్లోళ్లు రాజధాని గురించి మాట్లాడుకుంటుంటే అమాయకంగా వింటుండేదాన్ని. అట్ల వినగా రాజధానిలోని రాష్ట్ర భవిష్యత్తు ఉంటుందనేది తెలుసుకున్నాను. రాష్ట్రానికి రాజధాని తలలాంటిదని మా పిల్లలు చెబితే విన్నాను. ఆ రాజధాని నిర్మాణంలో తాను భాగం కావలని తలంచాను. ప్రస్తుతం సిఎం చంద్రబాబునాయుడు ఏకంగా రూ.4వేలు పెంచడమే కాకుండా గత మూడునెలలు కలిపి మొత్తంగా రూ.7వేలు. ఇచ్చారు. ఆ మొత్తాన్ని చూస్తేనే ఎందుకో నాకు రాజధాని గుర్తు వచ్చింది. అంతే నా చేతిలోకి పడిన డబ్బులను నా వంతు సాయంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతికి అందించా' అని పట్టణంలోని శివానగర్‌కు చెందిన నారాయణమ్మ తెలిపింది. వృద్ధురాలు తన పింఛను మొత్తాన్ని రాజధాని కోసం విరాళంగా ఇవ్వటంతో అటు మంత్రి,ఇటు పరిటాలశ్రీరామ్, చిలకం మధులతోపాటు కూటమి నాయకులు ఆశ్చర్యపోయారు. నారాయణమ్మకు రాష్ట్ర రాజధాని అమరావతిపై ఉన్న మక్కువతో తన పింఛను విరాళంగా ఇవ్వడం తమకెంతో ఆనందాన్ని ఇస్తోందని వారు అన్నారు. ఆమె దాతృత్వానికి మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని వారు పేర్కొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్స్ డే వేడుకలు ఆసుపత్రి వైద్యులు, హెడ్ నర్సులు, నర్సులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెండెంట్ మాధవి, డిప్యూటీ డిఎంహెచ్ఓ సాల్వియా సాల్మన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నజీర్, డాక్టర్ వెంకటేశులు, డాక్టర్ వివేక్ కుళ్లాయప, డాక్టర్ శైలజ, డాక్టర్ హరి శ్రీనివాస్, డాక్టర్ వంశీ, డాక్టర్ నితిన్ కుమార్, డాక్టర్ అనిల్, డాక్టర్ సురేష్, డాక్టర్ కిరణ్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ చంద్రిక, డాక్టర్ నివేదిత, డాక్టర్ శర్వాణి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న డిఆర్ఓ కొండయ్య


సకాలంలో ఫిర్యాదులకు పరిష్కారం : డిఆర్ఓ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వేదిక ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 114 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏవో వసుంధర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి సమస్యనూ పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. సుపరిపాలన అందించాలని సమర్థత, అవినీతిరహిత వ్యవస్థ లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. మండల, మున్సిపాలిటీ, డివిజన్ స్థాయిలో వచ్చే అర్జీలను సంబంధిత కార్యాలయాల్లోని అధికారులు సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్జీలను స్వీకరించే సమయంలో ఆధార్, ఫోన్ నెంబరు ఇచ్చేలా ప్రజలకు తెలపాలన్నారు. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వర్షాకాలంలో ఎక్కడ కూడా తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లో నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. డ్రెయినేజీలున్న ప్రాంతంలో నీటి పైపుల వల్ల లీకులు వల్ల నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందన్నారు. అలాంటి వాటిని గుర్తించి డ్రెయినేజీలను మరమ్మతులు చేయించాలన్నారు. వర్షాకాలంలో ఎక్కడా నీటి నిలువలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 3న జిల్లాకు సంబంధించి సర్వసభ్య సమావేశం ఉంటుందని, అన్ని శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించి నివేదికను సిద్ధం చేసుకుని హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు.

పోలీసుల సేవలు స్ఫూర్తిదాయకం : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్



రిటైర్డ్ ఉద్యోగి దంపతులకు సన్మానం

సుధీర్ఘకాలం పోలీసుశాఖలో ఎంతో విలువైన సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసుల సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి అన్నారు.ఈ సంధర్భంగా ఆదివారం ఉద్యోగవిరమణ పొందిన పోలీసులు సిబ్బందికి సోమవారం జిల్లా కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ శాలువ, పూలమాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఉద్యోగ విరమణ పొందిన స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ నారాయణరావు,సివిల్ ఎస్ఐ వెంకటరమణ, ఆర్ఎస్ఐ సలీం, ఎఆర్ఎస్ఐ రామచంద్రయ్య, డిఎస్ఆర్‌బి ఎస్ఐ ఇక్బాల్‌బాషా, సివిల్ ఎస్ఐ వెంకట బసయ్య అందించిన సేవలను ఎస్పీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్ విష్ణు, ఎఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, ఏవో సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, స్పెషల్ బ్రాంచ్ సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా పింఛన్ల పంపిణీ



పుట్టపర్తి మండలంలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె



ధర్మవరంలో పింఛను అందజేస్తున్న మంత్రి సత్యకుమార్, పరిటాలశ్రీరామ్



వికలాంగుడికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర



సికెపల్లి మండలంలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

టిడిపిది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. సోమవారం పెనుకొండ నియోజకవర్గంలోని సోమందేపల్లి, గోరంట్ల, పరిగి, రొద్దం, పెనుకొండ మండలాలలోని పలు గ్రామాలలో విస్తతంగా పర్యటించి లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్లను పంపిణీ చేశారు. పెనుకొండ నగర పంచాయతీచ రూరల్ పరిధిలోని రాంపురం పంచాయతీలలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పింఛను దారులతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు జూలై నెల పింఛను రూ .4వేలతో కలిపి ఏప్రిల్, మే, జూన్ నెలకు సంబందించి రూ. 3వేలతో సహ మొత్తం 7వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా నారా చంద్రబాబునాయుడు చారిత్రాత్మక నిర్ణయం తీసుకొని సామాజిక భద్రతపై మూడవ సంతకం చేశారని, ఈ సంతకంతో ప్రతి నిరుపేద ఇంటిలో పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. ప్రజాహిత పాలనకు ప్రజలు మహాకూటమికి అండగా నిలిచారన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని అన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా నారా చంద్రబాబు నాయుడు ఇంటింటా వెళ్లి పింఛన్లను పంపిణీ చేయడం స్పూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉదయ శంకర్ రాజు, నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, రాంపురం సర్పంచి శ్రీనివాసులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని పాలసముద్రం గ్రామంలో మంత్రి సవిత లబ్ధిదారులకు పింఛను అందజేశారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సచివాలయ ఉద్యోగులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని స్నేహలత నగర్ లో పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ తో కలిసి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను మంత్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రికి కాలనీ ప్రజలు, కూటమి నాయకులు, అధికారులు, ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సిద్దలింగప్ప, మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, హిందూపూర్ పార్లమెంట్ కార్యదర్శి చంద్రశేఖర్, మాజీ సింగల్ విండో అధ్యక్షులు డివి. ఆంజనేయులు, మాజీ జెడ్పీటీసీలు చల్లాపల్లి రామకృష్ణ, నడింపల్లి వెంకటేశులు, రైతు సంఘ నాయకులు హరికృష్ణ, సంజీవరెడ్డి, సర్పంచి నరసింహులు, సురేష్, బోర్ గోపాల్, ప్రభాకర్, బాబయ్య, నాయకులు చకర్లపల్లి శ్రీరాములు, ఆకుల రమణ, కొత్తపల్లి అరవింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి : రాష్ట్రంలో పింఛన్ల లబ్ధిదారుల ఇళ్లలో చంద్రబాబు ఒక పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చారని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ ఆట్టహాసంగా సాగింది. పరిటాల సునీత నియోజకవర్గంలోని పలు మండలాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారులతో కలసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ఆ తర్వాత అనంతపురం రూరల్ మండలం, రాచానపల్లి, రాప్తాడు, కనగానపల్లి మండలం మామిళ్లపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండల కేంద్రాలతో పాటు తన స్వగ్రామం వెంకటాపురంలో కూడా పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వెంకటాపురంలోని పింఛనుదారులు తమ పింఛను నుంచి అమరావతి నిర్మాణం కోసం 30వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. రాప్తాడులో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాగునీటి శుద్ధజల కేంద్రం ప్రారంభించారు, అలాగే సిసి రోడ్డుకు భూమి పూజ చేశారు.

కదిరి టౌన్ : రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం అనే నినాదంతోనే టిడిపి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీమద్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, ఆ వార్డు కౌన్సిలర్ సేగు సుధారాణి, పట్టణ ప్రధాన కార్యదర్శి బాబయ్య, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండలంలోని ఊటకూరు, పైడేటి గ్రామాలలో చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈసందర్భంగా టిడిపి మండల కన్వీనర్ ఎస్ఎన్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో మంత్రికి ఘన స్వాగతం పలికారు. పైడేటి కాలనీలో త్రాగునీటి సమస్య ,మురుగు కాలువల సమస్య తీవ్రంగా ఉందని సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరగా సానుకూలంగా స్పందించిన ఆమె వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామనిహామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచి బాలాజీ, మారుతిప్రసాద్, మాజీ ఎంపీటీసీ సోమప్ప, మాజీ సర్పంచి నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి ఈశ్వరప్ప నాగభూషణం, డిఎస్ఎల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని, పెడపల్లి, కొట్లపల్లి , నిడిమామిడి జగరాజుపల్లి, వెంకట గారి పల్లి, రాచు వారి పల్లి, ఇరగ రాజు పల్లి, పంచాయతీ పరిధిలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం లబ్ధిదారులకు రూ. 7వేల పింఛనును అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పుట్టపర్తి టౌన్ కన్వీనర్ బి రామాంజనేయులు , గ్రామీణ మండల కన్వీనర్ విజయ్ కుమార్, నాయకులు కంసల నారాయణస్వామి, రామయ్య, మాజీ ఎంపిటిసిలు నాగిరెడ్డి, రంగప్ప, నేతమప్ప, మాజీ సర్పంచులు రామ పెద్దపయ్య, రామాంజి, పెడపల్లి శ్రీరాం నాయక్, గడ్డం కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓడి చెరువు : మండలంలోని అన్ని గ్రామాలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సచివాలయ సిబ్బంది టిడిపి నాయకులు పంపిణీ చేశారు. ఓడి చెరువులో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పింఛన్లను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పిట్టా ఓబుల్ రెడ్డి, మండోజి ఆరిఫ్ ఖాన్ ,నిజాం, బోయపల్లి శివారెడ్డి ,ఆదినారాయణ, మాజీ జడ్పిటిసి రామలక్ష్మమ్మ, పీట్ల సుధాకర్, మండల కన్వీనర్ జయచంద్ర, సర్పంచులు శంకర్ రెడ్డి, రేణుక, ఎంపీటీసీ శ్రీనివాసులు, ఆంజనేయులు, చాంద్‌బాషా, షబ్బీర్, జోలి బాబా, ఆర్ఎంపి జాకీర్ అహ్మద్, గంగాద్రి , క్రిష్ణమూర్తి, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : కొత్త చెరువులోనే బీసీ కాలనీలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఆర్డీవో భాగ్య రేఖ, తహశీల్దార్‌కళావతి, ఎంపీడీవో సిద్ధారెడ్డి ,టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, కన్వీనర్ రామకృష్ణ, టిడిపి నాయకులు శివప్రసాద్, లక్ష్మీనారాయణ, గాజుల చంద్రమోహన్, బోయరాజు తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మేనిఫెస్టోలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం ఎన్డీఏ కూటమి ప్రభుత్వమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం బత్తలపల్లి మండలం వేల్పుమడుగు గ్రామంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న వారికి నాయకులు, కార్యకర్తలు భారీ గజమాల, డప్పుల మోతలు, పటాకులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కురబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాష్ బాబు, టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, రాష్ట్ర టిడిపి కుమ్మర సాధికార కన్వీనర్ మదనాపు పోతలయ్య, ముదుగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, నాయకులు ఆకులేటి వీరనారప్ప, జక్కంపూడి నాగభూషణ, గోనుగుంట్ల అమర్నాథ్ చౌదరి, గంటాపురం కొండేటి జగ్గు, సోమశేఖర్, చల్లా శ్రీనివాస్ నాయుడు, సంఘాల సూరి తదితరులతో పాటు జిల్లా, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : తనకల్లుకు లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేసే కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్లు శంకర్ నాయుడు, రాజారెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు ఈశ్వర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల కేంద్రంలోని దళితవాడలో చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు.కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ కె రామ్మోహన్, ఎంపీడీవో రామా నాయక్, టిడిపి మండల కన్వీనర్ సి కొండయ్య, సింగల్ విండో అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీలు జి సోమశేఖర్ రెడ్డి, జయ రామకృష్ణారెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పెంచిన సామాజిక భద్రతా పింఛన్లను ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి పంపిణీ చేసి ఒక పండుగ వాతావరణానిన తీసుకురావడం జరిగిందని వైద్యఆరోగ్యశాఖ మంత్రిసత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.ఈ మేరకు ఆయన సోమవారం టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకంమధుసూదన్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ధర్మవరం మండలం నాగలూరు. పట్టణంలోని 19, 35, 36, 6,7 వార్డులలో పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాం కుమార్, డీఎస్పీ శ్రీనివాసులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండలంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం రామయ్య, మండల కన్వీనర్ రాజశేఖర, మాజీ జడ్పిటిసి భర్త నాగభూషణ నాయుడు, మాజీ ఎంపీపీ మహబూబ్, మాజీ జడ్పిటిసి అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు

ముదిగుబ్బ : మండల కేంద్రంలో లబ్ధిదారులకు పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జిఎన్ఎస్ రెడ్డి, తహశీల్దార్ సరస్వతి ,సచివాలయ సిబ్బంది కూటమి నాయకులు ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, రమేష్ బాబు, ప్రభాకర్ నాయుడు, సోమల ప్రకాష్, తుమ్మల మనోహర్, తుమ్మల సూరి, జయప్ప తదితరులు పాల్గొన్నారు

పుట్టపర్తి అర్బన్ :ఎన్నికల ప్రచారంలో పింఛన్లు పెంపుదలపై ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకున్నారని శాసన సభ్యురాలు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించి పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో పాల్గొన్నారు. పట్టణంలోని సాయి నగర్, గోకులం, ప్రశాంతి గ్రామ్, కోవెలగుట్టపల్లి, కర్ణాటక నాకేపల్లి, రాయలవారిపల్లి, బీడుపల్లి, బడే నాయక్ తండా తదితర గ్రామాలలో టిడిపి నాయకులు పాల్గొన్నారు. పలుచోట్ల సర్వర్ పనిచేయక పోవడంతో వేలిముద్రలు పడలేనందున సచివాలయాల సిబ్బంది ఇబ్బంది పడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్య రేఖ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి మహమ్మద్ రఫీ, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలం వ్యాప్తంగా సోమవారం 91శాతం పింఛన్లను పంపిణీ చేశామని ఇఒఆర్‌డి శివన్న తెలిపారు. మండల వ్యాప్తంగా 6922పెన్షన్ లు ఉండగా ఆరు వేల మందికి పంపిణీ చేశామన్నారు. మండలంలోని చోళసముద్రం గ్రామంలో హిందూపురం శాసనసభ్యులు బాలకష్ణ భార్య వసుంధర పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్ కుమార్, తహశీల్దార్ బాల నరసింహులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మడకశిర : నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఎంపీ బి కే పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పింఛన్లకు లబ్ధిదారులకు అందజేశారు. రొళ్ల, గుడిబండ మండలాల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ అరుణ్ బాబు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అనే నినాదంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధర దేవి అన్నారు. సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని టిడిపి నాయకులు నియోజక వర్గ వ్యాప్తంగా ఒక పండుగల జరుపుకున్నారు. నందమూరి వసుంధర దేవి పలు ప్రాంతాలలో జరిగిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, తహశీల్దార్ శివప్రసాద్



గాండ్లపెంటలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట



మడకశిరలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని బత్తలపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. ఇదే గ్రామానికి చెందిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దేవాంగం జగదీశ్వర తన తండ్రి దేవాంగం చిదాంబరప్ప జ్ఞాపకార్థం పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. జగదీశ్వర్ పలు మండలాల్లో ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు విద్యాభివృద్ధికి సాయం చేయడమే కాకుడా సంచార జాతుల పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారికి విద్య తోపాటు అల్పాహారం అందిస్తున్నారు. నిరుపేద మహిళలకు తన వంతుగా ఆర్థిక సాయం చేయడమే కాక, సత్య సాయి విదేశీ భక్తుల ఆర్థిక సహాయ సహకారాలతో మహిళలకు భరోసా కల్పిస్తున్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో జగదీశ్వర్ కుటుంబ సభ్యులు పద్మావతమ్మ, సాయి లీల, విజయలక్ష్మి ,పార్వతి, రేవంత్ కుమార్, ఉపాధ్యాయులు లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి కలసి పనిచేద్దాం : ఎమ్మెల్యే



మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి కదిరి టౌన్

పట్టణాభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా పని చేద్దామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ఇటీవల ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందడంతో సోమవారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఎక్స్ అఫ్సియో సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ నజీమున్నీసా హాజరు కాకపోవడం శోచనీయమన్నారు. నాయకత్వం లేని వ్యక్తులు ఎన్నిక కాబడితే సమస్యలు తలెత్తుతాయన్నారు. రాజకీయంగా ఎన్నో రకాల సమస్యలు ఉండొచ్చు కానీ పట్టణ అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేద్దామన్నారు. ఒకే రకమైన సిద్ధాంతంతో పనిచేస్తున్నామని మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలను అరికట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను కౌన్సిలర్లు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు టిడిపి, జనసేన, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ రైడ్‌లో రికార్డు సృష్టించిన కదిరి యువకుడు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మోటారబుల్ పాస్ వాహనాలు వెళ్ళగలిగే ఎత్తైన ప్రదేశం వద్దకు కదిరి ప్రాంత యువకుడు బైకుపై వెళ్లి రికార్డు సృష్టించాడు. సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన దేవిరెడ్డి సుధీర్ కుమార్ రెడ్డి మే 12న కదిరి నుండి సొంత బైకుపై బయలుదేరి కేంద్ర పాలిత ప్రాంతమైన లతాక్ లోని ఉమ్మింగ్‌లలో 19,024 అడుగుల ఎత్తులో గల ఎత్తైన మోటారబుల్ పాస్ వద్దకు 12 రోజులలో చేరుకున్నాడు. ఢిల్లీ, శ్రీనగర్, లే లతాక్ ,హైవే మీదుగా పాకిస్తాన్, బోర్డర్‌కు ఉత్తరాన, చైనా బార్డర్ కు తూర్పున ఉన్న ఈ ప్రాంతానికి చేరేందుకు 3వేల కిలోమీటర్లు ప్రయాణించినట్లు తెలిపారు. ఈ బైక్ పై తాము రానుపోను 21రోజులు పాటు ఏడు వేల కిలోమీటర్లు పోయి వచ్చానని చెప్పారు. కదిరి నుంచి ఈ ప్రాంతానికి మొట్టమొదటిసారిగా తానే వెళ్లినట్టు చెప్పారు. రికార్డు సృష్టించిన యువకుడిని స్థానికులు అభినందించారు.



శిలాఫలకాన్ని చూపుతున్న బైక్‌రైడర్

సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్మికుల రిలేదీక్షలు



రిలే నిరాహార దీక్షలో పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి - పరిగి

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత నెల రోజులుగా డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నుండి రిలే నిరాహార దీక్షలకు కార్మికులు సిద్ధమయ్యారు. వీరి పోరాటానికి సిఐటియు నాయకులు అండగా నిలిచి వారి పక్షాన రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్నారు. పరిగి మండల కేంద్రంలోని సచివాలయం వద్ద పంచాయతీ కార్మికులతో పాటు స్వచ్ఛభారత్ కార్మికులు సమ్మెబాట పట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు రమేష్ మాట్లాడుతూ పరిగి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ లో ఉన్న 10నెలలు వేతనాలు చెల్లించాలని, 11 నెలలు అరియర్స్ ఇవ్వాలని, కనీస సౌకర్యాలు నూనె, సబ్బులు ,చెప్పులు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సజ్జరాయప్ప , కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ముర్తప్ప, రామంజి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బడి బస్సును నడపాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

లేపాక్షి మండలం గోపిదేవరపల్లి, శిరివరం గ్రామాలకు ఆర్టీసీ బడి బస్సును నడిపే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆర్టీసీ అధికారి హంపన్నకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతు గత సంవత్సరం నడిపిన ఆర్టీసీ బడి బస్సును తిరిగి పున ప్రారంభించాలన్నారు. స్పందించిన ఆర్‌టిసి అధికారి గతంలో నడిపిన ఆర్టీసీ బడి బస్సులను తిరిగి ఆ ప్రాంతాలకు నడుపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లిఖిత్, సురేష్, విక్రమ్, విశ్వాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల పరిధిలోని తరుగువాండ్లపల్లికి చెందిన జయప్రకాశ్ రెడ్డి అనే వ్యక్తి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డిగ్రీ చదివిన జయప్రకాష్‌రెడ్డి ఉద్యోగం రాకపోవటంతో తండ్రికి వ్యవసాయంలో చేదోడు వాదోడుగా ఉండేవాడు. పంటలు పండక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తన కుటుంబాన్ని చూసి తరచూ మదనపడేవాడు. ఇటు ఉద్యోగం రాక మనస్థాపానికి గురైన జయప్రకాష్‌రెడ్డి తన సొంత పొలంలో వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ .. డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని పరాకు వాండ్లపల్లి వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఎదురుగా వస్తున్న లారీలు ఢీకొన్న ఈ ప్రమాదానికి సంబందించిన వివరాలు.. మదనపల్లి వైపు నుండి వస్తున్న లారీ కదిరి వైపు నుండి వస్తున్న మరో లారీని వేగంగా ఢీకొంది. దీంతో కదిరి వైపు నుండి వస్తున్న లారీ అదే వేగంతో ఎదురుగా వచ్చిన ఆటోని, ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొని రహదారి పక్కనే ఉన్న ఓ ఇంటిలోకి దూసుకెళ్లింది. దీంతో ముందువైపు ఓ గది పూర్తిగా ధ్వంసం అయింది. అందులో నివసిస్తున్న మహిళ వెనుక రూములో నిద్రించడం వలన ఆమెకు ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో కదిరి వైపు నుండి వస్తున్న లారీ డ్రైవర్ మహమ్మద్ సోహెల్ (40) లారీలో ఇరుక్కుపోగా జెసిబి సహాయంతో అతడిని బయటికి తీసి 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకు వెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రమాద స్థలాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధరణిబాబు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న లింగమ్మ అనే మహిళను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్నామన్నారు.

రమేష్ రాథోడ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

గిరిజన సంఘం నాయకులు తెలంగాణ రాష్ట్ర మాజీ టిడిపి ఎంపీ , టిడిపి ఉమ్మడి రాష్ట్రాలు పొలిట్ బ్యూరో సభ్యుడుగా రమేష్ రాథోడ్ అందించిన సేవలను టిడిపి నాయకులు కొనియాడారు. ఈ మేరకు టిడిపి నాయకులు శ్రీనివాస్ రాథోడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రమేష్ రాథోడ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, ఎల్లప్ప, రఘునాథ్, రాథోడ్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి నల్లచెరువు

పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఈసందర్భంగా రూ.4,78,663లు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పుట్టపర్తి అసిస్టెంట్ కమిషనర్ నరసింహ రాజు, ఆలయ ఈవో రవీంద్ర రాజు , ఆలయ మాజీ చైర్మన్ దేవరింటి భాస్కర్ రెడ్డి నల్లచెరువు ఎఎస్ఐశేఖర్,ఆలయ అర్చకులు నాగరాజు,ఆంజనేయ దాస్ ,రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ , స్క్రీనింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్ధారణ పరీక్షలపై ప్రభుత్వ ఆసుపత్రి దంత వైద్యులు డాక్టర్ వివేకుల్లాయప్ప అవగాహన కల్పించారు. భారత ప్రభుత్వ హయాంలో అన్ని ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఆరోగ్య కార్యకర్తలకు ఓరల్గా క్యాన్సర్ స్క్రీనింగ్ పై అవగాహన కల్పించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్లు పాల్గొన్నారు.